సాక్షి ప్రకాశం

బుధవారం । 30 । ఆగస్టు । 2023



కంభం ఫేమస్ తేరాతేజి

కంభం చెరువు కట్ట వద్ద బుధవారం తేరా తేజి ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. అందు కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. - 8లో..



గంజాయి విక్రేతలపై కఠిన చర్యలు

జిల్లాలో గంజాయి విక్రేతలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. పలువురిపై పీడీ కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం 36/28

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

లా కాలేజీ విద్యార్థినికి మూడు బంగారు పతకాలు



గవర్నర్ చేతులమీదుగా పతకాలు అందుకుంటున్న విద్యార్థిని ఎం.రోజా

ఒంగోలు: ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో జరిగిన స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతులమీదుగా ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీ విద్యార్థిని ఎం.రోజా మంగళవారం మూడు బంగారు పతకాలను అందుకున్నారు. 2014–17 బ్యాచ్‌కు చెందిన విద్యార్థిని రోజా అత్యధిక టోటల్ మార్కుల సాధనలో, విద్యార్థినుల్లో అత్యధిక మార్కులు పొందడం, ప్రత్యేక సబ్జక్టులలో అత్యధిక మార్కులను కైవసం చేసుకోవడం అనే మూడు అంశాల్లో మూడు బంగారు పతకాలను ఆచార్య నాగార్జున యూనివర్శిటీ స్నాతకోత్సవంలో అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఒంగోలు ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీ యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించారు.

ఉర్దూ రేంజి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌గా మొయినుద్దీన్



షేక్ మొయినుద్దీన్

ఒంగోలు: ఉర్దూ రేంజి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌గా షేక్ మొయినుద్దీన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు రేంజి ప్రాంతీయ సంచాలకులు ఇచ్చిన ఆదేశాల మేరకు బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం మొయినుద్దీన్ కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ ఉర్దూ మీడియం బోధిస్తున్నారు.

1న గలిజేరుగుళ్లలో బండ పందెం

బేస్తవారిపేట: మండలంలోని గలిజేరుగుళ్లలో అభయాంజనేయస్వామి ఆలయ ధ్వజ స్తంభం ప్రతిష్ఠ, రాధకృష్ణ స్వామివార్ల విగ్రహ, శిఖర కలశ ప్రతిష్ఠ సందర్భంగా సెప్టెంబర్ 1వ తేదీన రాష్ట్ర స్థాయిలో పాలపండ్ల సైజ్ ఎడ్ల బండ పందెం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరో బహుమతులు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 99899 10057, 95428 62027 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అన్ని అర్హతలు ఉండి.. ఏవైనా కారణాలతో సంక్షేమ ఫలాలు అందని వారందరికీ మేలు చేయాలన్న తపనతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ సంక్షేమ పథకాల కోసం 45,443 దరఖాస్తులు వచ్చాయి. అందులో 27,450 మందికి కొత్తగా వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చారు. రూ.27,41,27,968ల ఆర్థిక ప్రయోజనం కలిగింది.



జగనన్న సురక్షలో దరఖాస్తు చేసుకుని పథకాలు మంజూరైన లబ్ధిదారుల లబ్ధి చెక్ అందజేస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు (ఫైల్)

సంక్షేమం.. ఎందాకైనా..

- అర్హత ఉండి పథకాలు పొందని వారిని గుర్తించి మరీ లబ్ధి
- ఇంటింటి సర్వే ద్వారా లబ్ధిదారుల గుర్తింపు
- జగనన్న సురక్షతో అవసరమైన ధ్రువీకరణ పత్రాలు మంజూరు
- జిల్లాలో వివిధ పథకాలకు కొత్తగా 27,450 మందికి లబ్ధి
- వారికి రూ.27 కోట్లకు పైగా ఆర్థిక ప్రయోజనం

ఒంగోలు అర్బన్:

గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలు, సేవలను ప్రజలకు చేరువ చేశారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. ఇంకో అడుగు ముందుకేసి ఏవైనా కారణాలతో అర్హత ఉండి పథకాలను అందని వారికి కూడా మేలు చేయాలనే సంకల్పంతో జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అన్ని అర్హత ఉన్నా అవసరమైన ధ్రువపత్రాలు లేకనో ఇతర ఏ కారణాలతోనో సంక్షేమ ఫలాలు అందని వారిని ఇంటింటి సర్వే ద్వారా గుర్తించారు. అర్హులకు మేలు చేశారు.

ఇంటింటికీ వెళ్లి జల్లెడ..

సురక్ష కార్యక్రమం ద్వారా ఊరు.. వాడల్లో ప్రతి ఇంటినీ జల్లెడ పట్టారు. అన్ని అర్హతలున్నా ప్రభుత్వ పథకాలు పొందని వారిని గుర్తించారు. అవసరమైన కుల, నివాస, ఆదాయ, జనన, మరణ ధ్రువపాత్రలతో పాటు వివాహ ధ్రువీకరణ, మ్యుటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్, మ్యుటేషన్ కరక్షన్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఆధార్ మొబైల్ లింక్, రైస్‌కార్డులు, సీసీఆర్సీ, స్ప్లిట్ హౌస్‌హోల్డ్ తో కలిపి మొత్తం 11 రకాల ధ్రువపత్రాలను పూర్తి ఉచితంగా అందజేశారు. వెంటనే వారికి ఏ పథకం వర్తిస్తుందో నిర్ధారించి వెంటనే ఆయా పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదును జమ చేశారు. జిల్లా వ్యాప్తంగా సురక్ష కార్యక్రమం ద్వారా 45,443 దరఖాస్తులు అధికారులకు చేరాయి. వారిలో లబ్ధిదారులను ఎంపిక చేసి ఈ నెల 24వ తేదీ ఏ కారణంతో అయినా సంక్షేమ పథకాల ప్రయోజనం అందని వారిని గుర్తించిన లబ్ధిదారులకు నగదును అకౌంట్లలో జమ చేశారు. జిల్లాలో డిసెంబర్ 2022 నుంచి గుర్తించిన 27,450 మంది లబ్ధిదారులకు జగనన్న అమ్మ ఒడి, జగనన్న చేదోడు, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, వైఎస్సార్ మత్స్యకార భరోసా, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు, వైఎస్సార్ ఆసరా పథకాలకు సంబంధించి రూ.27,41,27,968ల ఆర్థిక ప్రయోజనాన్ని కల్పించారు.

ఆరవ స్థానంలో జిల్లా

సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలు అందజేసిన వినతుల్లో 99.52 శాతం సేవలు ప్రజలకు అందించడంతో రాష్ట్రంలో జిల్లా 6వ స్థానంలో నిలిచింది. జిల్లాలోని 719 సచివాలయాల పరిధిలో 4,63,919 వినతులు అందగా వాటిలో 4,61,521 వాటిని పరిష్కరించారు. వీటిలో ఒంగోలు డివిజన్‌లో 1,84,204, మార్కాపురం డివిజన్‌లో 1,65,000, కనిగిరి డివిజన్‌లో 1,14,715 సేవలను అందజేశారు. వలంటీర్లు జిల్లాలోని 7,70,325 ఇళ్లకు తిరిగి వినతులు స్వీకరిస్తే వాటిలో 6,71,098 ఇళ్లకు సంబంధించి ప్రజలకు ప్రభుత్వ సేవలు అందచేశారు.

అర్హులకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం



అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం. ఆ మేరకు జిల్లాలో ఏవైనా కారణాలతో పథకాలు అందని వారిని గుర్తించి వారికి లబ్ధి చేకూర్చాం. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్షణ పథకాన్ని అమలు చేసి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేయడమే కాకుండా వారికి వెంటనే ప్రభుత్వ పథకాలను అందించారు. దీని వలన జిల్లాలో 27 వేల మందికి పైగా వివిధ పథకాలకు సంబంధించి లబ్ధి చేకూరింది. జగనన్న సరక్ష పథకం అమలులో జిల్లా 6వ స్థానంలో నిలిచింది. ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంతో ప్రజల జీవన విధానం అభివృద్ధి చెందాలి.

– కె.శ్రీనివాసులు, జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్





ఆత్మీయ బంధనం

అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్. రాఖీపౌర్ణమి రోజున సోదరులకు కట్టే రాఖీల కోసం మహిళలు, యువతులు దుకాణాలకు క్యూకడుతున్నారు. దీంతో నగరంలోని రాఖీలు విక్రయించే దుకాణాల వద్ద సందడి నెలకొంది.

– సాక్షి, ఒంగోలు









పురస్కారం అందుకుంటున్న నేమాని సీతారామమూర్తి



పురస్కారం అందుకుంటున్న మైనంపాటి సాయి

మైనంపాటి, నేమానికి తెలుగు భాషా సేవా పురస్కారాలు

ఒంగోలు మెట్రో: గిడుగు రామమూర్తి 160వ జయంతి వేడుకల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం తెలుగు భాషా సేవా పురస్కారాలను ఒంగోలుకు చెందిన ఎర్రన సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్, రచయిత నేమాని సీతారామమూర్తి అందుకున్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం అధికార భాషా అధ్యక్షుడు విజయ్ బాబు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు వారి చేతుల మీదుగా ఈ పురస్కారాలు అందుకున్నారు.

మాదకద్రవ్యాలను అరికట్టాలి

- సాగు, రవాణా, వినియోగంపై అవగాహన కల్పించాలి
- ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: జిల్లాలో మాదక ద్రవ్యాలను అరికట్టాలని, అందుకు సంబంధిత శాఖలు మరింత సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ కే శ్రీనివాసులు సూచించారు. మాదక ద్రవ్యాల నివారణపై జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. దీనిలో ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల సాగు, రవాణా, వినియోగం, వీటివలన చట్టపరమైన సమస్యలు, ఆరోగ్య సమస్యలు తదితర అంశాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మాదక ద్రవ్యాల సాగును కట్టడి చేసేందుకు సాగు స్థాయిలోనే ఈ–క్రాప్ బుకింగ్ సమయంలో వ్యవసాయ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వాటి రవాణా జరగకుండా చెక్‌పోస్టుల వద్ద పక్కా నిఘా ఏర్పాటు చేయాలన్నారు. రవాణా, మార్కెటింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రిమడాల్ డ్రగ్స్‌ను ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయించకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వలస కార్మికులుండే ప్రాంతాలు, కాలేజీల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, కనిగిరి ఆర్డీవో అజయ్‌కుమార్, ఆర్ఐఓ సైమన్ విక్టర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, డ్రగ్స్ కంట్రోల్ ఏడీ జ్యోతి, మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ సుధాకర్, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, మార్కెటింగ్ ఏడీ ఉపేంద్ర, జీజీహెచ్ మానసిక వైద్యులు లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన అవసరం



శిక్షణలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు టౌన్: పంచాయతీరాజ్ చట్టంపై పంచాయతీ కార్యదర్శులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు చెప్పారు. మంగళవారం పోలీసు ట్రయినింగ్ కళాశాలలో పంచాయతీ కార్యదర్శుల ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శులుగా ఎంపికైన 165 మందికి శిక్షణ ఉపయోగాన్ని వివరిస్తూ ప్రసంగించారు. క్షేత్రస్థాయిలో ఎటువంటి ఇబ్బంది లేకుండా విధులు నిర్వహించేందుకు పంచాయతీరాజ్ చట్టాన్ని సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ, గ్రామసభ, ఆర్థిక వనరుల వినియోగం గురించి విశ్లేషించారు. ప్రజాప్రతినిధులను కలుపుకుంటూ ప్రజల సమస్యలను పరిష్కరించే బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే అని చెప్పారు. శిక్షణ తరగతుల అనంతరం ప్రాక్టికల్ నాలెడ్జి కోసం క్షేత్రస్థాయి పర్యటనను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే పనిఒత్తిడి నుంచి తప్పించుకునేందుకు హార్ట్‌ఫుల్‌నెస్ సంకల్ప మెడిటేషన్ సభ్యులచే మెడిటేషన్‌ను కూడా శిక్షణలో చేర్చినట్లు చెప్పారు. ఈ ఆరు రోజుల శిక్షణ వలన పంచాయతీ కార్యదర్శులుగా ఎంపికైన అభ్యర్థులు మరింత ఉత్సాహంతో పని చేసే అవకాశం ఉంటుందని జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ఐఆర్డీ జాయింట్ డైరక్టర్ సుభాషిణి, పీటీసీ ఎస్పీ దామోదర్, జిల్లా వనరుల కేంద్రం ప్రిన్సిపాల్ జాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు 4జి సేవలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీఎం సుధీర్

ఒంగోలు టౌన్: రానున్న రెండు నెలల్లో దేశ వ్యాప్తంగా 4జి సాంకేతికతను బీఎస్ఎన్ఎల్ ప్రవేశ పెట్టనున్నట్లు ఆ సంస్థ జిల్లా జనరల్ మేనేజర్ ఎస్.సుధీర్ తెలిపారు. మంగళవారం ఆయన ఒంగోలులోని బీఎస్ఎల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఇప్పటికీ కొంతమంది వినియోగదారులు 3జి సిమ్ ద్వారానే మొబైల్ సేవలు పొందుతున్నారని, 4జి సేవలు మొదలైన తరువాత వీరి మొబైల్ సేవల్లో అంతరాయం కలిగే అవకాశాలున్నాయని తెలిపారు. రంతర సేవల కోసం తమ 3జి సిమ్‌ను 4జిలోకి మార్చుకోవాలని చెప్పారు. ఇప్పుడు 4జిలోకి మారడం వలన ప్రస్తుతం కొనసాగుతున్న 2జి, 3జి సేవల్లో ఎలాంటి అంతరాయం ఏర్పడదని చెప్పారు. రెండు నెలల తరువాత దానికదే 4జిలోకి మారుతుందన్నారు. ఈ సౌకర్యం పొందేందుకు సెప్టెంబరు 30వ తేదీ వరకు ఉచితంగా సిమ్ అప్‌డేషన్ చేయనున్నట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వ నిబంధనల ప్రకారం బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు వెంటనే కేవైసీ ద్వారా డిజిటలైజేషన్ చేయించుకోవాలన్నారు. దీని వల్ల భవిష్యత్తులో మరిన్ని ఆధునిక సౌకర్యాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సేవా కేంద్రంలో కాని, ఫ్రాంచైజీ, రిటైలర్‌లను సంప్రదించి కేవైసీ, సిమ్ అప్‌డేషన్‌లను చేయించుకోవాలని సూచించారు. అలాగే తమ మొబైల్ ఫోన్‌లో ఉన్న సిమ్ ఏదో తెలుసుకోవడానికి సిమ్ అని టైప్ చేసి 9441129999కు మెసేజ్ పంపించి తెలుసుకోవచ్చని చెప్పారు.

కేంద్రంలో ముందస్తు ఎన్నికలను స్వాగతిస్తున్నాం

- మోదీని గద్దె దించడమే ప్రధాన లక్ష్యం
- సీపీఐ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మార్కాపురం: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ డిసెంబరులో పార్లమెంటు ఎన్నికలు రావచ్చని చెప్పిన నేపథ్యంలో తమ పార్టీ ముందస్తు ఎన్నికలను స్వాగతిస్తోందని, త్వరగానైనా మోదీ గద్దె దిగుతాడని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీని గద్దె దించడమే లక్ష్యంగా దేశ వ్యాప్తంగా ప్రతిపక్షాలన్నీ రెండు సమావేశాలు నిర్వహించాయని, ఈనెల 31న మళ్లీ సమావేశమవుతున్నట్లు తెలిపారు. మణిపూర్ ఘటనలకు ప్రధాని మోదీ నైతిక బాధ్యత వహించాలన్నారు. విదేశాల్లో తిరుగుతున్న ఆయన మణిపూర్‌లో జరిగిన హింసను ఆపాలనే ప్రయత్నం కానీ, బాధితులకు ధైర్యం చెప్పే పర్యటనలు చేయలేదన్నారు. అధికారంలోకి రాకముందు నల్లధనాన్ని భారత్‌కు తెస్తానని హామీ ఇచ్చారని, అయితే గుజరాత్‌కు చెందిన బడా పారిశ్రామికవేత్తలు వేలకోట్ల రూపాయల బ్యాంకు రుణాలను ఎగ్గొట్టి విదేశాల్లో ఎంజాయ్ చేస్తున్నారన్నారు. తొమ్మిదేళ్లలో ఒక్క పబ్లిక్ రంగ సంస్థను కూడా దేశంలో ఏర్పాటు చేయకపోగా, ఉన్న ప్రభుత్వ సంస్థలను కూడా ప్రైవేటు పరం చేస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం ఇప్పటి నుంచే బీజేపీ నాయకులు ప్రజల్లో మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారన్నారు. వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని, మార్కాపురం జిల్లాగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు రామకృష్ణ తెలిపారు. దొనకొండ పారిశ్రామిక వాడను అభివృద్ధి చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు అందె నాసరయ్య, ఎస్‌కె ఖాశీం, దేవండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



క్లుప్తంగా

పొగాకు చూర అత్యధిక ధర రూ.209


టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో పొగాకు చూర అత్యధిక ధర రూ.209 పలికింది. పొందూరు, ఎం.నిడమానూరు, తూర్పునాయుడుపాలెం గ్రామాల రైతులు 734 చూర బేళ్లను వేలానికి ఉంచగా వాటిలో 715 కొనుగోలయ్యాయి. 19 పొగాకు చూర బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. కనిష్ఠ ధర రూ.51 పలకగా, సరాసరి ధర రూ.139.12 పలికింది. వేలంలో మొత్తం 21 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

హమ్మయ్యా.. హారం దొరికింది!


బంగారు హారాన్ని ప్రయాణికురాలికి అప్పగిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

ఒంగోలు టౌన్: ఆమె అదృష్టం బాగుంది. కనిపించకుండాపోయి కాసేపు హైరానా పెట్టించిన బంగారు హారం దొరికింది. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం రాత్రి ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్న ఓ ప్రయాణికురాలు గరుడ బస్సులో లగేజీ బాక్సులో తన బ్యాగు పెట్టారు. అందులో మూడు లక్షల విలువైన బంగారు నల్లపూసల దండ నుంది. ఎందుకో అనుమానం వచ్చిన ఆమె కాసేపటి తర్వాత వెళ్లి చూస్తే అక్కడ బ్యాగు కనిపించలేదు. ఆందోళనకు గురైన ఆమె.. సహ ప్రయాణికుల సాయంతో చుట్టు పక్కల వెదికారు. అయినా బ్యాగు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వరరావు సీసీ ఫుటేజీని పరిశీలించి సిబ్బందితో వెతికించారు. లగేజీ బాక్సులోనే బ్యాగు భద్రంగా ఉందని సమాచారం. ప్రయాణికురాలికి బంగారు నగల బ్యాగును పోలీసులు తిరిగి అప్పగించారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

యువతి విషయంలో బెదిరించాడని హత్యకు కుట్ర

దర్శి: యువతి విషయమై బెదిరించి డబ్బు డిమాండ్ చేశాడన్న ఆగ్రహంతో ఓ యువకుడిని అంతమొందించేందుకు యత్నించిన సంఘటన దర్శి మండలంలోని త్రిపురసుందరీపురం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై రామకృష్ణ కథనం మేరకు.. త్రిపురసుందరీపురానికి చెందిన ఓ యువతితో నారాయణ అనే వ్యక్తి సన్నిహితంగా ఉంటున్నాడు. ఇటీవల ఆ యువతి సెల్‌ఫోన్ కనిపించకుండా పోయింది. ఆ ఫోన్‌లో ఇద్దరూ కలిసి ఉన్న ఫొటోలు ఉన్నాయి. అయితే ఆ సెల్‌ఫోన్ తన వద్ద ఉందని సిసింద్రీ అనే వ్యక్తి నారాయణను బెదిరించి డబ్బు తీసుకున్నాడనే నెపంతో కక్ష పెంచుకున్నాడు. జముకులదిన్నె ఎన్‌ఎస్పీ కెనాల్ వద్దకు నమ్మకంగా తీసుకెళ్లి పొక్లెయిన్ బొచ్చె చివర లైటు వేస్తా చూడమని చెప్పి అందులోకి ఎక్కించాడు. ఎనిమిది అడుగుల ఎత్తు నుంచి ఒక్కసారిగా కింద పడేశాడు. పొక్లెయిన్‌తో తొక్కించబోగా సిసింద్రీ తప్పించుకుని పారిపోయాడు. వెంటనే పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. నారాయణ కూడా తమ సెల్‌ఫోన్ తీసుకుని బ్లాక్‌మెయిల్ చేసి సిసింద్రీ డబ్బులు తీసుకుంటున్నాడని ఫిర్యాదు చేశాడు. పరస్పర ఫిర్యాదులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కంభం ఫేమస్.. తేరాతేజీ


తేరాతేజ పండుగనాడు కోలాహలంగా ఉన్న కంభం చెరువు (ఫైల్)

- గరిక తొక్కుడు పండగకు కంభం చెరువు వద్ద ఏర్పాట్లు
- ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేని పండగ ఇక్కడే..


కంభం చెరువు

కంభం: పండగలంటే అన్ని ప్రాంతాల్లో ప్రజలు నిర్దేశిత రోజున నిర్వహించుకుంటారు. అయితే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా కంభంలో మాత్రమే నిర్వహించే ఓ ప్రత్యేకమైన పండగ ఉంది. అదే తేరాతేజీ(గరిక తొక్కుడు) పండగ. ఆసియా ఖండంలోనే అతి పెద్ద చెరువుల్లో రెండోదైన కంభం చెరువు కట్ట.. తేరాతేజీ పండగకు వేదిక.

పండగ విశిష్టత ఇదీ..

నెలపొడుపు కనిపించిన 13వ రోజు తేరాతేజీ పండగను ముస్లింలు నిర్వహించుకుంటారు. తేరాతేజీ నెలను చేదు నెలగా చెబుతుంటారు. నూతనంగా వివాహం చేసుకున్న యువతీ యువకులు నెల పొడుపు కనిపించినప్పటి నుంచి ఒకరి ముఖం ఒకరు చూసుకోకుండా తేరాతేజీ సందర్భంగా కంభం చెరువు కట్టపై కలుసుకుంటారు. అక్కడే వారి పెళ్లి నాటి దండలను నీటిలో వదిలి మొక్కులు చెల్లిస్తారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనాలు చేస్తారు. పండగ సందర్భంగా చెరువు కట్టపై దీనాషావలి దర్గా వద్ద ప్రత్యేక పూజలు చేస్తారు. చెరువుకట్టపై ఉన్న పచ్చికను తొక్కితే ఆరోగ్యానికి మంచిదని ముస్లింల నమ్మకం. ఈ నేపథ్యంలోనే తేరాతేజీని గరిక తొక్కుడు పండగగా పిలుస్తారు.

ఏర్పాట్లు సిద్ధం

బుధవారం తేరాతేజీ సందర్భంగా కర్నూలు, గుంటూరు, నంద్యాల, గిద్దలూరు, దొనకొండ, వినుకొండ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ముస్లింలు కంభం చెరువుకు వచ్చే అవకాశం ఉంది. రైళ్లను సైతం చెరువు కట్ట సమీపంలో ట్రాక్‌పై ఆపి అక్కడే దిగుతుంటారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టినట్లు కంభం ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు. చెరువులో నీరు అధికంగా ఉన్నందున తూములు, మెట్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు.

గంజాయి విక్రేతలపై కఠిన చర్యలు

- ఎస్పీ మలికా గర్గ్


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

మార్కాపురం రూరల్: జిల్లాలో గంజాయి విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, పలువురిపై పీడీ యాక్ట్ నమోదుచేశామని ఎస్పీ మలికా గర్గ్ తెలిపారు. వార్షిక తనిఖీలో భాగంగా స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ మంగళవారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పోలీసు శాఖపై నమ్మకం పెంచేలా వ్యవహరించాలన్నారు. రానున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మార్కాపురం పట్టణంలో ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఏర్పాటుకు కృషిచేస్తున్నానన్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టినట్లు తెలిపారు. స్టేషన్‌లో నమోదైన కేసుల్లో దర్యాప్తు త్వరగా పూర్తిచేసి కోర్టుల్లో చార్జ్‌షీట్‌ను దాఖలు చేయాలన్నారు. పెండింగ్ కేసులను త్వరగా పూర్తిచేసి గుడ్‌ట్రయల్ మానిటరింగ్ ద్వారా కేసుల్లో నిందితుల్లో శిక్షలు పడేలా చూడాలని సిబ్బందికి సూచించారు. రహదారుల ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి రోడ్డు భద్రతా నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రాపర్టీ కేసుల్లో నిందితులను త్వరగా పట్టుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. దొంగతనాల కట్టడి, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్నామని, ప్రతి గ్రామంలో వీటిని ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. ఈమె వెంట ట్రైనీ ఐపీఎస్ అంకితా సురానా, మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి, డీఎస్‌బీ డీఎస్పీ మరియదాస్, సీఐ భీమానాయక్, ఎస్సైలు వెంకటేశ్వర నాయక్, శశికుమార్‌లు పాల్గొన్నారు.

1న కంభంలో మెగా జాబ్‌మేళా


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెప్టెంబర్ ఒకటో తేదీన నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు వినియోగించుకోవాలని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు కోరారు. మంగళవారం మార్కాపురంలోని తన నివాసంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా నిర్వహిస్తున్న జాబ్‌మేళా వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. జాబ్‌మేళాలో 12 కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. 10వ తరగతి నుంచి పీజీ వరకూ చదివిన 18 నుంచి 35 ఏళ్లలోపు నిరుద్యోగ యువతీ యువకులు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 80088 22821, 70139 50097ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో సీడాప్ జేడీఎం డి.రజనీకాంత్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం, సిబ్బంది శీను, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి


ఈ-శ్రమ్ కార్డులు పంపిణీ చేస్తున్న జిల్లా జడ్జి భారతి

ఒంగోలు: అసంఘటిత రంగంలోని కార్మికుల హక్కుల పరిరక్షణకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ నిరంతరం కృషి చేస్తోందని ఆ సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో కార్మిక శాఖ సహకారంతో అసంఘటిత రంగంలోని కార్మికులకు ఈ-శ్రమ్ గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి మాట్లాడుతూ.. అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులకు ఉచిత న్యాయ సహాయం అందజేస్తామన్నారు. అదే విధంగా అర్హులైన వారికి ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని, వారికి సంబంధించిన పథకాల అమలు విషయంలో న్యాయపరమైన సమస్యలు ఎదురైతే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించవచ్చని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్యాంబాబు, కార్మిక శాఖ అధికారులు వెంకటేశ్వర్లు, పవన్ కుమార్ పాల్గొన్నారు.

నకిలీ యోగా సర్టిఫికెట్లతో మోసం

గిద్దలూరు రూరల్: యోగా టీచర్ సర్టిఫికెట్లు ఇప్పిస్తానంటూ కడపకు చెందిన చాంద్‌బీ అనే మహిళ తమ వద్ద నగదు తీసుకుని నకిలీవి అంటగట్టి మోసగించిందని గిద్దలూరు మండలంలోని సంజీవరాయుడుపేట గ్రామానికి చెందిన కె.సుబ్రహ్మణ్యం మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనతోపాటు తన భార్య నాగమణికి యోగా టీచర్ సర్టిఫికెట్లు ఇస్తానంటే రూ.4.69 లక్షల నగదును చాంద్‌బీకి చెల్లించామని, అలాగే తనకు తెలిసిన మరో ఇద్దరితో రూ.3.47 లక్షలు ఇప్పించామని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదాని ఎడ్యుకేషన్ ఫౌండేషన్, నేషనల్ డిజిటల్ ఎడ్యుకేషనల్ అనే సంస్థల పేరు మీద నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి తమకు అందజేశారని బాధితులు వాపోయారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి


బాలక్రిష్ణ (ఫైల్)


ఘటనా స్థలంలో మృతదేహం

పామూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని బేల్దారీ కూలీ మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి మండల కేంద్రమైన పామూరు సమీపంలో 565 జాతీయ రహదారిపై జరిగింది. వివరాల్లోకి వెళితే..మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన ఆరెకొండ బాలక్రిష్ణ బేల్దారీ పనులు చేసుకుంటూ జీవనంసాగిస్తున్నాడు. బాలక్రిష్ణ కొంతకాలంగా తన అత్తగారి ఊరు నెల్లూరుజిల్లా రొంపిదొడ్ల గ్రామంలో ఇల్లు తీసుకుని భార్య, కుమారునితో ఉంటూ చుట్టుపక్కల పనులు బేల్దారీ పనులు చేసుకుంటూ స్వగ్రామమైన గోపాలపురంకు అప్పుడప్పుడు వచ్చిపోతుంటాడు. పనిమీద స్వగ్రామమైన గోపాలపురంవచ్చి బైక్‌పై రొంపిదొడ్లకు తిరిగి వెళ్తున్న సమయంలో పామూరు సమీపంలో 565 జాతీయ రహదారిపై బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొనగా తలకు, ఛాతీకి తీవ్రగాయాలై లక్రిష్ణ (35) అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో స్థానిక వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నామని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కనిగిరి వైద్యశాలకు తరలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. భర్త బాలక్రిష్ణ ఇంటికివస్తే అందరు కలిసి భోజనం చేద్దామని ఎదురుచూస్తుండగా మృతివార్త తెలియడంతో భార్య సుభాషిణి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఒక్కగానొక్క కుమారుడు ఆదరువుగా నిలుస్తాడనుకుంటే ఇలా మృత్యువాత పడటంతో మృతుని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి


మృతి చెందిన సౌమ్య

టంగుటూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన తూర్పునాయుడుపాలెం-బాపూజీ కాలనీ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు గడ్లూరుకు చెందిన సాధినేని సౌమ్య(28) తన బంధువు శ్రీకాంత్‌తో కలిసి ఫోన్ రిపేర్ చేయించుకునేందుకు ఒంగోలు వచ్చింది. తిరిగి వెళ్తున్న క్రమంలో తూర్పునాయుడుపాలెం సమీపంలో లారీ ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన సౌమ్య అక్కడికక్కడే మృతిచెందింది. శ్రీకాంత్‌కు స్వల్పగాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని ఎస్సై ఖాదర్‌బాషా పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు.

తెలుగువారికి స్ఫూర్తిప్రదాత గిడుగు

- ఎస్పీ మలికా గర్గ్


గిడుగు రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: గ్రాంధిక భాషగా ఉన్న తెలుగుకు ప్రజల భాషగా పట్టాభిషేకం చేసిన బహు భాషా శాస్త్రవేత్త, సంఘ సంస్కర్త గిడుగు రామ్మూర్తి తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని ఎస్పీ మలికా గర్గ్ కొనియాడారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి 160వ జయంతిని ఘనంగా నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. తెలుగు భాష అందాన్ని, విలువను ప్రపంచానికి చాటిచెప్పిన గిడుగు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారన్నారు. గతంలో కొద్దిమందికే పరిమితమైన చదువు.. గిడుగు చేసిన నిరంతర కృషి వల్ల అందరికీ అందుబాటులోకి వచ్చిందన్నారు. పండితులకే పరిమితమైన సాహిత్య సృష్టి.. సృజనాత్మకశక్తి ఉన్న ప్రతి ఒక్కరి చెంతకు చేరేందుకు గిడుగు దోహదపడ్డారన్నారు. తెలుగు భాషకు చేసిన సేవకు గుర్తింపుగా మద్రాసు ప్రభుత్వం రావు బహదూర్ బిరుదుతో సత్కరించిందని, కైజర్ హింద్ బిరుదు ఆయనను వరించిందని చెప్పారు. ఆయన జయంతి తెలుగు భాషకు పుట్టినరోజులాంటిదని, గిడుగుకు నమస్సులు అర్పించడం మనందరికీ గర్వకారణమన్నారు. ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఆర్‌ఐలు శ్రీహరిరెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషా కీర్తి.. గిడుగు రామ్మూర్తి


తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న రచయితలు, కవులు

ఒంగోలు మెట్రో: ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రంగారాయుడు చెరువు పక్కన ఉన్న తెలుగుతల్లి, శ్రీకృష్ణదేవరాయలు, అన్నమయ్య విగ్రహాలను పూలమాలతో అలంకరించారు. ప్ర.ర.సం అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు మాట్లాడుతూ.. గిడుగు వెంకట రామ్మూర్తి తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడని, వ్యవహారిక భాషలో ఉన్న అందాన్ని, మాధుర్యాన్ని తెలియజెప్పిన మహనీయుడని కొనియాడారు. నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం(నరసం) అధ్యక్షురాలు తేళ్ల అరుణ మాట్లాడుతూ.. ఆంధ్రదేశంలో వ్యవహారిక భాషోద్యమానికి మూలపురుషుడు గిడుగని, బహుభాషా శాస్త్రవేత్తగా, చరిత్రకారుడిగా, సంఘసంస్కర్తగా, హేతువాదిగా ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. తెలుగు భాషకు గిడుగు కీర్తి తెచ్చారని పేర్కొన్నారు. ప్ర.ర.సం కార్యదర్శి కుర్రా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ.. మాతృభాషను పిల్లల కోసం తప్పనిసరి చేయడానికి సన్నాహాలు చేయాలని కోరారు. అనంతరం విగ్రహాలు ఏర్పాటు చేసిన డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావును తెలుగు భాషాభివృద్ధికి పాటుపడుతున్న కవులు యూవీఎస్ శాస్త్రి, యూవీ.రత్నంను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మల్లికార్జునరావు, రాఘవులు, ధేనువకొండ సుబ్బారావు, ప్రసాద్, గుంటూరు సత్యనారాయణ, డాక్టర్ మొగిలి దేవప్రసాద్, ఓరుగంటి ప్రసాద్, పురాణం మురళి తదితరులు పాల్గొని తెలుగు భాష గొప్పదనం గురించి వివరించారు.

జాతీయస్థాయి ఉషూ పోటీలకు ఎంపిక



ఉషూలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఒంగోలు: స్థానిక ఐకాన్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి ఉషూ పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం గుంటూరు జిల్లా నల్లపాడులో జరిగిన మహిళా ఉషూ లీగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో చావ లేహ్య, ధూళిపాళ్ల సృజన, కాపా రితిక, కొమ్మాలపాటి వర్షిత, మంట్ల నందితలు బెంగళూరులో త్వరలో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను పాఠశాల యాజమాన్యం కాపా చిరంజీవి, కాపా ఝాన్సీలు అభినందించారు.

మద్యం మత్తులో అమానుషం

- కడపరాజుపల్లెలో బాలునిపై యువకుడి లైంగిక దాడి
- బాలుడిని కాలువలో విసిరేయడంతో గాయాలు
- నాయనమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు

పెద్దదోర్నాల: మద్యం మత్తులో ఓ యువకుడు బాలునిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. జిల్లా పెద్దదోర్నాల మండల పరిధిలోని కడపరాజుపల్లెలో అమానుషం చోటుచేసుకుంది. ఈ సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకోగా బాధితుని బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని కడపరాజుపల్లెకు చెందిన ఓ బాలుడు పెద్దదోర్నాలలోని ఓ వసతి గృహంలో ఉంటూ అక్కడే 6వ తరగతి చదువుకుంటున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోని బంధువుల పెళ్లి నిమిత్తం స్వగ్రామానికి చేరుకుని రెండు రోజులుగా అక్కడే ఉంటున్నాడు.

సోమవారం రాత్రి గ్రామంలోని ఓ పెళ్లికి హాజరైన నిందితుడు మద్యం సేవించాడు. ఈ క్రమంలో బాలుడిని మాయమాటలతో గ్రామ సమీపంలోని జీరుకొండ ప్రాంతానికి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం కొండపై ఉన్న కాలువలో విసిరేయడంతో బాలుడికి గాయాలయ్యాయి. బాలుడి తల్లిదండ్రులు పనుల నిమిత్తం పల్నాడు జిల్లాలోని మరో ప్రాంతానికి వెళ్లడంతో తన నాయనమ్మ ఆలనాపాలనా చూస్తోంది. బాధితుడి నాయనమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. బాధిత బాలుడిని వైద్య పరీక్షల నిమిత్తం మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించినట్లు యర్రగొండపాలెం సీఐ మారుతీకృష్ణ తెలిపారు.

క్రీడలతో విద్యార్థులకు ఉన్నత భవిత

ఒంగోలు: క్రీడాకారులు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని నగర మేయర్ గంగాడ సుజాత పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మినీ స్టేడియంలో హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి పురస్కరించుకుని జిల్లా యువజన సంక్షేమ శాఖ నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవంలో మాట్లాడారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సహకారంతో నగర పాలక సంస్థ నిధులు వెచ్చించి వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేస్తామన్నారు. స్టెప్ సీఈవో ఎంవీఎస్ లోకేశ్వరరావు మాట్లాడుతూ క్రీడల రిజర్వేషన్ ద్వారా జీవితాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. క్రీడా ప్రతిభా అవార్డులను పొందిన వ్యాయామ ఉపాధ్యాయులు కె.మల్లికారాణి, పి.బసవయ్య, పి.సుశీల, బి.శ్రీనివాసరెడ్డి, కుమార్, హెప్సీబా తదితరులను ఘనంగా సత్కరించారు. వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి వై.శీనయ్య, ట్రిపుల్ ఐటీ ఫిజికల్ డైరెక్టర్ పి.భాస్కర్, రాంప్రసాద్, నవోదయ కబడ్డీ కోచ్ సిసింద్రి, బాక్సింగ్ కోచ్ వేణు పాల్గొన్నారు.


జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో సత్తా చాటి మెడల్స్, ప్రశంస పత్రాలు అందుకున్న విద్యార్థులతో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, అధికారులు